జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజలకోసం
## కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి
బుధవారం 25, మార్చి, 2026 | 11 పేజీలు



## ఎంసిహెచ్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలి

### కలెక్టర్ కోయ శ్రీహర్ష

### మాతా-శిశు సంరక్షణ కేంద్రం పనితీరుపై సమీక్ష

పెద్దపల్లి, మార్చి 24( ప్రజాజ్యోతి ) : గర్భిణీ మహిళలకు ఎంసిహెచ్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో మాతా-శిశు సంరక్షణ కేంద్రం (ఎంసిహెచ్) పనితీరుపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రసవానికి సమీపంలో ఉన్న గర్భిణీల వివరాలను తప్పనిసరిగా ఈడీబీ రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. 102 అమ్మ ఒడి వాహనాల ద్వారా గర్భిణీలను ఆసుపత్రులకు తరలించి అవసరమైన పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

2లో




## టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో

# భాగస్వామ్యులు కావాలి

- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- బోయినపల్లి మండలం కొదురుపాక పీహెచ్ సీలో ప్రపంచ టీబీ నివారణ దినోత్సవం
- పేషెంట్లకు పోషకాహార కిట్ల పంపిణీ
- ఉత్తమ వైద్య సేవలు అందించిన వైద్యులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేత

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి మార్చి -24 (ప్రజాజ్యోతి) : టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దే కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. ప్రపంచ టీబీ నివారణ దినోత్సవాన్ని బోయినపల్లి మండలం కొదురుపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్ సీ)లో మంగళవారం నిర్వహించగా, కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా 15 మంది టీబీ బాధితులకు పోషకాహార కిట్లు, కోడిగుడ్లను కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికారులు పంపిణీ చేశారు.

2లో




## చివరి ఆయకట్టుకు

# అందని సాగునీరు..

### ఆందోళన చెందుతున్న రైతులు

### పోచమ్మ చెరువు నుండి బైరాను కుంట వరకు నీటిని విడుదల చేయాలి

కొడిమ్యాల,మార్చి 24,(ప్రజాజ్యోతి): మండలంలోని నాచుపల్లి గ్రామంలోని పోచమ్మ చెరువు కింద చివరి ఆయకట్టులో నీటి కొరత తీవ్రంగా మారిందని,చెరువులో నీరు ఉన్నప్పటికీ చివరి భాగానికి సరఫరా లేకపోవడంతో సుమారు 30 ఎకరాల సాగు భూమిలో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీరు అందకపోవడంతో ఇప్పటికే కొన్ని పొలాల్లో పంటలు పూర్తిగా ఎండిపోవడం ప్రారంభమైందని రైతులు తెలిపారు. 2లో..

## కేంద్ర ప్రజా వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి




- సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి
- జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా

కరీంనగర్ టౌన్,మార్చి 24 (ప్రజాజ్యోతి ) కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజా వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా విత్తనాలు, విద్యుత్ సంబంధిత చట్టాలు తీసుకొచ్చిందని ఆరోపించారు. బహుళజాతి సంస్థలకు అనుకూలంగా చట్టాలు రూపొందిస్తున్నారని, రైతాంగాన్ని భూమి నుంచి వేరు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం కార్మిక వర్గం సాధించిన 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లు తీసుకువచ్చారని, అవి కార్మికులకు ప్రతికూలమని విమర్శించారు.

2లో

## వేములవాడలో శ్రీరామనవమి కళ్యాణోత్సవానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు : జిల్లా ఎస్పీ




వేములవాడ,మార్చ్,24:ప్రజాజ్యోతి : వేములవాడ రాజన్న క్షేత్రంలో ఈ నెల 27న జరగనున్న శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం సందర్భంగా భారీగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అధికారులకు సూచించారు. మంగళవారం రోజున ఆలయ అధికారులు, పోలీస్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో ఆలయ పరిసరాలు, శివార్చన ప్రదేశం,పార్కింగ్ ప్రదేశాలు పరిశీలించి పలు సూచనలు చేసారు. ఈసారి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివార్చన వేదికపై శ్రీ సీతారాముల వారి కళ్యాణోత్సవం నిర్వహించనున్నా నేపథ్యంలో భక్తులకు సులభంగా, సౌకర్యవంతంగా దర్శనం కల్పించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని తెలిపారు.

2లో

# టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో భాగస్వామ్యులు కావాలి





మొదటి పేజీ తరువాయి

అలాగే టీబీ రహిత గ్రామాలుగా ప్రకటించిన 20 గ్రామాల కార్యదర్శులు, వైద్య సిబ్బందికి ప్రశంసా పత్రాలు, ఉత్తమ సేవలు అందిస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించి, శాలువాతో సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో మొబైల్ ఎక్స్ రే యంత్రం ద్వారా జిల్లాలోని 42 గ్రామాల్లో మొత్తం 100 రోజుల్లో చేయనున్న వ్యాధి నిర్ధారణ పరీక్షల ప్రోగ్రామ్ ను కలెక్టర్ ప్రారంభించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. టీబీ నివారణ దినోత్సవం సందర్భంగా పోస్టర్లు ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేశారు. కలెక్టర్ మాట్లాడారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి 6 నుంచి జూన్ 12 వ తేదీ వరకు అన్ని శాఖలకు సంబంధించిన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ఆద్వర్యంలో ప్రత్యేక వైద్య నిపుణులతో సేవలు అందిస్తున్నామని వివరించారు. రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు సైతం వైద్య పరీక్షలు చేయిస్తున్నామని తెలిపారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా జిల్లాలో టీబీ నిర్ధారణ ఆరోగ్య పరీక్షలు మొబైల్ వాహనం, ఎక్స్ రే యంత్రం ద్వారా ప్రణాళిక ప్రకారం చేస్తారని, మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. మెరుగైన వైద్య సేవల కోసం జిల్లా, ఇతర ఆసుపత్రులకు తరలించి వైద్యం అందించాలని సూచించారు. టీబీ బాధితులకు ప్రతి నెలా రూ. వెయ్యి ఆర్థిక సహాయం ప్రభుత్వం అందిస్తున్నదని వెల్లడించారు. పేషెంట్లు కచ్చితంగా మందులు వాడుతూ.. పోషకాహారం తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 360 మందికి పోషకాహార కిట్లు పంపిణీ చేశామని కలెక్టర్ తెలిపారు.సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రజిత, ప్రోగ్రామ్ ఆఫీసర్ అనిత, డిప్యూటీ డీఎం హెచ్ ఓ నాగేంద్ర బాబు, వైద్యులు శంకర్, సత్యనారాయణ, ఆనంద్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ రేణు ప్రియాంక, రాజు కుమార్, తహసీల్దార్ నారాయణ రెడ్డి, సర్పంచ్ కే మంజుల, ఎంపీఓ శ్రీధర్, టీబీ సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



# ఎంసిహెచ్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలి



మొదటి పేజీ తరువాయి

ఫిబ్రవరి నెలలో ఎంసిహెచ్‌లో 182 ప్రసవాలు జరిగినట్లు వెల్లడిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను మరింత పెంచాలని అన్నారు. ఆశా కార్యకర్తలు అందించే సమాచారాన్ని సూపర్వైజర్లు ధృవీకరించాలని, 102 సేవలను సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రసవం అనంతరం తల్లి, శిశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, టీకాల కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలని సూచించారు.మంథని ఎంసిహెచ్ పనితీరు మెరుగుపడిందని పేర్కొంటూ, మరింత మెరుగైన సేవల కోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆసుపత్రి సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు ఓపి సేవలను టోకెన్ విధానంలో అందించాలని అన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు డ్యూటీ డాక్టర్ అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రోగులు మరియు సహాయకులకు తగిన సీటింగ్ సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. రోగులను తిరస్కరించకుండా వైద్య సేవలు అందించాలని, సెక్యూరిటీ, నర్సింగ్ సిబ్బంది ప్రవర్తన మెరుగుపరచాలని సూచించారు. టాయిలెట్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఇల్లందకుంట బ్రహ్మోత్సవాలకు జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌కు ఆహ్వానం

**ఇల్లందకుంట, మార్చి 24(ప్రజాజ్యోతి):** అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట సీతారామచంద్ర స్వామి దేవాలయంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ దేవస్థానం అధికారులు ఆహ్వానించారు. దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు, ఆలయ ధర్మకర్తలు కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను జ్ఞాపికతో కలిసి అందజేశారు. మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ, బ్రహ్మోత్సవాల సందర్భంగా జమ్మికుంట మున్సిపాలిటీ తరఫున పరిశుభ్రత, త్రాగునీరు మరియు భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాల కోసం రాజకీయాలకు అతీతంగా పూర్తి సహకారం అందిస్తామని



తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, దేవస్థానం ధర్మకర్తలు పాల్గొన్నారు

# చివరి ఆయకట్టుకు అందని సాగునీరు..

మొదటి పేజీ తరువాయి

పోచమ్మ చెరువు నుంచి బైరానుకుంట వరకు నీటిని విడుదల చేసి చివరి ఆయకట్టుకు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నీటి సరఫరా కల్పించి పంటలను కాపాడాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు సౌగాని ఒదయ్య, చిగుర్ల బీరయ్య, తొంటి చిన్న గంగయ్య, గుర్రాల సాయి రెడ్డి, తొంటి చిన్న బీరయ్య, పల్లెమీది మల్లయ్య, సౌగాని నాగయ్యలు కోరారు.

మా చివరి ఆయకట్టుకు నీరు రావడం లేదు...చెరువులో నీరు ఉన్నా మా పొలాలకు చేరడం లేదు.30 ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి.దయచేసి నీటిని విడుదల చేసి మా పంటలను కాపాడండి సార్..."

–తొంటి బీరయ్య...నాచుపల్లి (రైతు)



# వేములవాడలో శ్రీరామనవమి కళ్యాణోత్సవానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు:జిల్లా ఎస్పీ.

మొదటి పేజీ తరువాయి



భక్తుల భద్రతా దృష్ట్యా బ్యారికేడ్లు,కళ్యాణోత్సవం అనంతరం స్వామివారిని దర్శించుకునేందుకు ప్రత్యేక క్యూలైన్లు,పార్కింగ్ సదుపాయాలపై , సైన్ బోర్డ్స్ పై ప్రత్యేక దృష్టి సారించి, ట్రాఫిక్ రద్దీని నియంత్రించే విధంగా ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు.భక్తుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఎస్పీ వెంట డిఎస్పీ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, ఆలయ ఈ ఈ రాజేష్, డి.ఈ రఘునందన్, రామ్ కిషన్ రావు సిబ్బంది పాల్గొన్నారు.

# కేంద్ర ప్రజా వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి:




మొదటి పేజీ తరువాయి

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మార్పులు చేసి కొత్త చట్టం తీసుకురావడం వల్ల వ్యవసాయ కూలీలపై భారం పడుతుందని తెలిపారు. పాత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.నిత్యవసర వస్తువుల ధరలు పెరగడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని, వంటగ్యాస్ ధరలను తగ్గించాలని కోరారు. పెరిగిన ధరలను తగ్గించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని, అలా చేస్తే మహిళలకు నెలకు రూ.2,500 సహాయం, పెన్షన్ల పెంపు, నిరుద్యోగ భృతి, పంటలకు బోనస్ వంటి హామీలు అమలవుతాయని అన్నారు.రిజర్వాయర్ నిర్వాసితులకు తగిన నష్టపరిహారం చెల్లించాలని, జిల్లా కేంద్రంలోని డంప్ యార్డు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది సమస్యలు కూడా వెంటనే పరిష్కరించాలని కోరారు. స్థానిక ప్రజా సమస్యలపై జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో పది రోజుల పాటు ప్రచారం నిర్వహించామని, భవిష్యత్తులో సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

# ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో వేములవాడ అభివృద్ధి

## 80 లక్షలతో షాదీఖానా నిర్మాణం: పుల్కం రాజు

- వేములవాడలో షాదీఖానా స్థలాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్మన్.. సకల వసతులతో నిర్మాణం చేపడతామని వెల్లడి!

**వేములవాడ,మార్చ్,24:ప్రజాజ్యోతి.** వేములవాడ పట్టణాభివృద్ధిలో భాగంగా ముస్లిం సోదరుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం షాదీఖానా నిర్మాణానికి 80 లక్షల రూపాయలను మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు క్షేత్రస్థాయిలో పర్యటించి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ అక్రమ్ మరియు ఇతర మత పెద్దలతో సమావేశమై వారి సలహాలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ మరియు సహకారంతో పట్టణంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, అందులో భాగంగానే మైనార్టీల చిరకాల కోరిక అయిన షాదీఖానాకు నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సహకారంతో అన్ని హంగులతో, సకల వసతులతో ఈ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందని, పట్టణ అభివృద్ధిలో అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఐజు) వరుణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, 25వ వార్డు కౌన్సిలర్ కొక్కుల బాలకృష్ణ, ముస్లిం మైనార్టీ కమిటీ నాయకులు మరియు పలువురు మత పెద్దలు పాల్గొన్నారు.



# పాతర్లపల్లిలో గాలికుంటు టీకాల పంపిణీ



**ఇల్లందకుంట, మార్చి 24 (ప్రజాజ్యోతి):** మండలంలోని పాతర్లపల్లి గ్రామంలో జాతీయ ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం గ్రామ సర్పంచ్ బైరెడ్డి వెంకటరమణారెడ్డి ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన, పాడి రైతులు తమ పశువులకు ఈ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు.పశువుల ఆరోగ్యం కాపాడటం ద్వారా రైతుల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రైతుల సంక్షేమం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సుమారు 145కు పైగా పశువులకు ఉచితంగా టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ విజేందర్ రావు, జేవో రవీందర్, ఎల్ఎస్ఏలు కనకయ్య, ప్రేమ్ కుమార్, గోపాలమిత్రులు కోడం శ్రీనివాస్, నవీన్, చిరంజీవి, తిరుపతి, మహేందర్, సాయి తేజ తదితరులు, పాడి రైతులు పాల్గొన్నారు.

# ఆరు సంవత్సరాలుగా గుంతల మయంగా

## ఇల్లందకుంట-పరకాల రహదారి

- బ్రహ్మోత్సవాల ముందు భక్తులకు ఇబ్బందులు అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

**ఇల్లందకుంట, మార్చి 24 (ప్రజాజ్యోతి):** ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా కల్పించాల్సిన ప్రధాన రహదారి గత ఆరు సంవత్సరాలుగా గుంతల మయంగా మారి ప్రయాణికులకు నరకయాతనగా మారింది. ఇల్లందకుంట--పరకాల ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి అంతటా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి, వాహనాలు నెమ్మదిగా కదలాల్సి వస్తోంది. కొన్నిచోట్ల రోడ్డు పూర్తిగా చెదిరిపోవడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది.

వర్షాకాలంలో పరిస్థితి మరింత విషమంగా మారుతోంది. గుంతలు నీటితో నిండిపోవడం వల్ల అవి కనిపించక వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇప్పటికే పలువురు చిన్నపాటి ప్రమాదాలకు గురయ్యారని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించడానికి భయపడుతున్నారు.

ఇదే సమయంలో మరో రెండు రోజుల్లో ప్రారంభమయ్యే శ్రీ సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా వేలాది మంది భక్తులు ఇల్లందకుంటకు రానున్నారు. ఈ రహదారి పరిస్థితి వల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయానికి వచ్చే ప్రధాన మార్గం ఇదే కావడంతో పరిస్థితి మరింత కీలకంగా మారింది.



అయినప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. కొన్నిసార్లు తాత్కాలికంగా గుంతలు పూడ్చినా, కొన్ని రోజుల్లోనే మళ్లీ అదే పరిస్థితి వస్తోందని ప్రజలు అంటున్నారు. శాశ్వత పరిష్కారానికి ఎలాంటి ప్రణాళికలు కనిపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి నాణ్యమైన రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, భక్తులు డిమాండ్ చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల ముందు అయినా కనీసం తాత్కాలికంగా రహదారి మరమ్మత్తులు చేపట్టి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు

# గ్యాస్ సిలిండర్ కొరతలేదు.పౌరసరఫరాల అధికారి

**వేములవాడ,మార్చ్,24:ప్రజాజ్యోతి.** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వంట గ్యాస్ వినియోగదారులకు తెలియజేయునది ఏమనగా ప్రస్తుతము జిల్లాలో తగినంత గ్యాస్ నిల్వలు కలవు. వినియోగదారులు బుకింగ్ చేసిన క్రమము తేదిల వారిగా గ్యాస్ ఏజెన్సీ వారు, వారి దగ్గర గల గ్యాస్ నిల్వల క్రమము గ్యాస్ సిలిండర్ లు డెలివరీ చేస్తారు. వినియోగదారులు ఎలాంటి ఆందోళన పడవద్దని మరియు మున్సిపాలిటీ పరిదిలో బుకింగ్ చేసిన 25 రోజులకు మరియు రూరల్ పరిది లో 45 రోజుల లోపు గ్యాస్ సిలిండర్ లు డెలివరీ అవుతుంది.కావున, వినియోగదారులు గమనించగలరు, ఎలాంటి ఆందోళన పడవద్దని అని అన్నారు.




# భీమన్నను దర్శించుకున్న ఉమ్మడి కరీంనగర్ విజిలెన్స్ ఎస్పీ



**వేములవాడ,మార్చి,24:ప్రజాజ్యోతి.** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లా విజిలెన్స్ ఎస్పీ శ్రీ శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు, వేద పండితులు వారికి ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో ఎల్. రమాదేవి స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని వారికి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# జన గణ విధుల్లో కేటాయింపులో ఎస్జీటీలకు ప్రాధాన్యత ఇవ్వాలి

**ఎల్లారెడ్డిపేట మార్చి 24( ప్రజా జ్యోతి ):** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మంగళవారం రోజు టీఎస్ యుటిఎఫ్ ఎల్లారెడ్డిపేట శాఖ పక్షాన మండల తాసిల్దార్ ని కలిసి జన గణన విధులలో ఎన్యూమరేటర్లుగా ఎస్ జి టి లను, సూపర్వైజర్ గా ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎం లను ।స్కూల్ అసిస్టెంట్లను సూపర్వైజర్లుగా నియమించాలి ఉద్యోగులు వినతిపత్రాన్ని అందజేశారు .ఈ కార్యక్రమంలో జిల్లా టీఎస్ యుటిఎఫ్ కార్యదర్శి శివకుమార్, మండల అధ్యక్షుడు తుమ్మనపల్లి నరేష్, సంపత్ కుమార్ ,అంజలి, పద్మ తదితరులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# ఇల్లందకుంట బ్రహ్మోత్సవాలకు జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌కు ఆహ్వానం



**ఇల్లందకుంట, మార్చి 24(ప్రజాజ్యోతి):** అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట సీతారామచంద్ర స్వామి దేవాలయంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ దేవస్థానం అధికారులు ఆహ్వానించారు. దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు, ఆలయ ధర్మకర్తలు కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను జ్ఞాపికతో కలిసి అందజేశారు.మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ, బ్రహ్మోత్సవాల సందర్భంగా జమ్మికుంట మున్సిపాలిటీ తరఫున పరిశుభ్రత, త్రాగునీరు మరియు భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాల కోసం రాజకీయాలకు అతీతంగా పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, దేవస్థానం ధర్మకర్తలు పాల్గొన్నారు

# అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ ఆమోదం హర్షనీయం

### టీజేవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామి తేజ




**కరీంనగర్ టౌన్,మార్చి 24( ప్రజాజ్యోతి )** న్యాయవాదుల రక్షణకు సంబంధించిన అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అసెంబ్లీలో ఆమోదించడం హర్షణీయమని టీజేవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది గాదం స్వామి తేజ తెలిపారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ కేసుల్లో తమ వర్గాలకు మద్దతుగా నిలిచిన న్యాయవాదులపై ప్రత్యర్థులు దాడులకు దిగుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో హత్యల వరకు జరుగుతున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో న్యాయవాదులకు సరైన రక్షణ అవసరమని అన్నారు.
అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమల్లోకి రావడం వల్ల న్యాయవాదులపై దాడులకు పాల్పడిన వారిపై ప్రత్యేక శిక్షలు విధించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ చట్టం న్యాయవాదులకు భద్రత కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.ఈ బిల్లును ఆమోదించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రివర్గ సభ్యులకు, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ న్యాయవాదులకు అండగా నిలుస్తున్నందుకు అభినందనలు తెలియజేశారు.

# రాచర్ల బొప్పాపూర్‌లో ఘనంగా ఎల్లమ్మ కళ్యాణోత్సవం



**ఎల్లారెడ్డిపేట మార్చి 24 (ప్రజా జ్యోతి)** ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలో మంగళవారం ఉదయం శ్రీ రేణుక మాత ఎల్లమ్మ కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం పోచమ్మ బోనాల అనంతరం రేణుక మాతకు బోనాలు తీసి పెద్ద పట్టణం వేసి నాగేల్లి పట్నం కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు



**శంకరపట్నం:మార్చి24(ప్రజా జ్యోతి)** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంటమహిపాల్..అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసి ఉద్యమాలను ఉధృతం చేస్తామని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంట మహిపాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం బిఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం లో భాగంగా మండల పార్టీ నాయకులను కేశవపట్నం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి, కేశవపట్నం పోలీస్ స్టేషన్ లోని బంధించారు. ఈ సందర్భంగా గంట మైపాల్ మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర కోసం తెలంగాణ ప్రదాత, తెలంగాణ గాంధీ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి టిఆర్ఎస్, బి ఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో పేద బడుగు బలహీన వర్గాలకు అనేక ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేసి తెలంగాణ రాష్ట్రం లో పేద ప్రజానీకానికి అండగా నిలిచారని, 2023 లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో మాయ మాటలు చెప్పి ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వము తెలంగాణ రాష్ట్రంలో యువతకు ఉపాధి హామీ లేదు. పేద బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు కరువు చేస్తూ నిరంకుశ పాలన కొనసాగిస్తుందని, టిఆర్ఎస్ ఆధ్వర్యంలో యువత అసెంబ్లీ ముట్టడి,కార్యక్రమాన్ని నిర్వహించేందుకు శ్రీకారం చుట్టింది పాలకులు నిరంకుశంగా వ్యవహరిస్తూ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని అడ్డుకోవాలని ముందస్తుగా తెల్లవారుజామునే పార్టీ నాయకుల ఇండ్లలోకి చేరుకొని కేశవపట్నం పోలీసులు తమను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ లో నిర్బంధించారని, ఎన్ని అరెస్టులు ఎన్ని కేసుల అయిన అదిరేది లేదు, బెదిరేది లేదు, నాడు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణ త్యాగాలకు సిద్ధమై ఉద్యమాలు చేసిన బిఆర్ఎస్ పార్టీ నాయకులని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడి ప్రజా సంక్షేమ ధ్యేయంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని మహిపాల్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాంపల్లి ఆదిత్య, గుర్రంశ్రీకాంత్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# టిబి అంతం- మన అందరి పంతం - విద్యార్థులతో భారీ



**జమ్మికుంట, మార్చి24( ప్రజాజ్యోతి ):** ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా జమ్మికుంట పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థులతో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వరుణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. “టి బి అంతం -- మన అందరి పంతం”, “టి బి రహిత సమాజం నిర్మిద్దాం” వంటి నినాదాలతో విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. ర్యాలీ అనంతరం డాక్టర్ వరుణ, హెల్త్ ఎడ్యుకేటర్ అడిదెల మోహన్ రెడ్డి విద్యార్థులకు ట ి బి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టి బి పరీక్షలు, మందులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితమని తెలిపారు.అనంతరం విద్యార్థులతో మానవహారం నిర్వహించి, టి బి నివారణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కమిషన్ల కోసమే టెండర్ల నిలిపివేత : సిపిఐ




**కరీంనగర్ టౌన్,మార్చి 24( ప్రజాజ్యోతి )** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్లను కమిషన్ల కోసమే నిలిపివేస్తున్నారని సిపిఐ నాయకులు ఆరోపించారు. సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు న్యాలపట్ల రాజు, పైడిపల్లి రాజు మంగళవారం ఈ మేరకు విమర్శలు చేశారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల ముందు విలీన గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్ల నిధులను మంజూరు చేసి టెండర్లు కూడా పిలిచిందని తెలిపారు. ఆన్‌లైన్‌లో టెండర్లు దాఖలైనప్పటికీ వాటిని ఇప్పటివరకు ఓపెన్ చేయకుండా, మళ్లీ కొత్తగా టెండర్లు పిలవాలని నూతన పాలకవర్గం ప్రయత్నించడం దురుద్దేశపూర్వకమని ఆరోపించారు. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ నిధులతో 87 అభివృద్ధి పనులకు పరిపాలన అనుమతి లభించిందని, అందులో 25 పనులకు బిడ్లు రాకపోయినా మిగిలిన 62 పనుల్లో వచ్చిన టెండర్లను నిబంధనల మేరకు ఖరారు చేసి పనులు ప్రా రం భి ంచా ల్సి ం ద ని పేర్కొన్నారు. అయితే టెండర్లను రద్దు చేసి మళ్లీ పిలవాలని ప్రయత్నించడం కమిషన్ల కోసమేనని విమర్శించారు.నగర అభివృద్ధి పనులు రాజకీయ జోక్యంతో నిలిచిపోయాయని, విలీన డివిజన్లలో మౌలిక వసతుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేకపోతే సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# మడిపల్లి రైతువేదికలో రైతులకు శిక్షణ కార్యక్రమం



**జమ్మికుంట, మార్చి24 ( ప్రజాజ్యోతి ):** హుజురాబాద్ బిటిటి ఆధ్వర్యంలో మడిపల్లి రైతువేదికలో మడిపల్లి, అంకుసాపూర్ గ్రామ రైతులకు పంటల సాగులో నానో యూరియా వినియోగం, వరి, మొక్కజొన్న పంటల సస్యరక్షణ చర్యలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.కృషి విజ్ఞాన కేంద్రం జమ్మికుంట శాస్త్రవేత్త విజయ్ మాట్లాడుతూ భూమి ఆరోగ్యం పంటల దిగుబడిలో కీలకమని తెలిపారు. పచ్చి ఎరువులుగా జీలుగా, జనుము, పిల్లి పెసర వంటి పంటలను వేయడం ద్వారా నేల సారం పెరుగుతుందని చెప్పారు. ఆర్గానిక్ కర్బనం పెరిగితేనే భూమి శక్తి మెరుగుపడుతుందని, సహజ సాగు పద్ధతులు ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయని సూచించారు. మండల వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్ మాట్లాడుతూ పంటలను చీడపీడల నుండి ర క్షిం చే ం ద ు క ు సూడోమోనాస్‌ను మూడు దఫాలు పిచికారీ చేయాలని సూచించారు. వేప నూనె వినియోగం పురుగుల నియంత్రణలో సహాయ పడుతుందని తెలి పారు. వరి పంటలో అగ్గి తెగులు పెరుగుతున్న నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. అధిక యూరియా వాడకం వల్ల పంటలకు రోగాలు వచ్చే అవకాశం ఉందని, నానో యూరియాను తరువాత దఫాల్లో స్ప్రే చేయడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ట్రైసైక్లజోల్, ఏమమెక్టిన్ బెంజ్యోటే, జూజ మినహా ఇతర పురుగుమందులతో నానో యూరియాను కలిపి వాడవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో మడిపల్లి సర్పంచ్ పసుల తిరుమల, అంకుసాపూర్ సర్పంచ్ కవిడే కుమారస్వామి, ఉపసర్పంచ్ కొండల్ రెడ్డి, ఏఈఓ రాంప్రసాద్ , గ్రామ రైతులు పాల్గొన్నారు.

# వల్భాపూర్‌లో ఆదిపత్య పోరు.. ప్రజలకు ఇబ్బందులు, అభివృద్ధి నిలిచిపోతోందా?




**వీణవంక, మార్చ్ 25,(ప్రజాజ్యోతి )** వీణవంక మండలం వల్భాపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఆదిపత్య పోరు కారణంగా సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో రెండు వర్గాల మధ్య రోజురోజుకూ విభేదాలు పెరుగుతూ శాంతి భద్రతలకు భంగం కలిగించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు కూడా నిలిచిపోతున్నాయి.గ్రామంలో కొత్తగా ఇళ్లు నిర్మించుకునే వారు, కరెంట్ మీటర్లు పొందదలచిన వారు, అలాగే కొత్త నీటి కనెక్షన్లు తీసుకునే వారు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఒక వర్గం అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తే, మరో వర్గం అడ్డంకులు సృష్టించడం వల్ల పనులు పూర్తిగా ఆగిపోతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ఈ విషయంపై బీజేపీ సీనియర్ నాయకులు ఎట్టెపు మహేష్ స్పందిస్తూ, గ్రామంలో జరుగుతున్న వర్గపోరు ప్రజలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నదని అన్నారు. అభివృద్ధి పనులు రాజకీయ విభేదాల బలవంతంగా నిలిచిపోవడం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు.
ఇలా కొనసాగితే గ్రామ అభివృద్ధి పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించిన ఆయన, సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. గ్రామంలో శాంతి వాతావరణం నెలకొల్పి, అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.గ్రామ ప్రజలు కూడా తక్షణమే ఈ సమస్య పరిష్కారం కావాలని, శాంతి భద్రతలు కాపాడాలని కోరుతున్నారు.



## వీర్నపల్లి మండలంలో వడగండ్ల వాన...

**ఎల్లారెడ్డిపేట మార్చి 24 (ప్రజా జ్యోతి)** ఎల్లారెడ్డిపేట మండలం వీర్నపల్లి మండలాలలో మంగళవారం మధ్యాహ్నం వడగండ్ల వాన తో నష్టం కలిగినట్టు రైతులు తెలియజేశారు ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్పూర్ ,గుట్టపల్లి చెరువు తండా వీర్నపల్లి మండలాలలో కంచర్ల ,వీర్నపల్లి ,మద్దిమల్ల, రంగంపేట తదితర ప్రాంతాల్లో వర్షంతో పాటు వడగండ్ల వాన పడ్డట్టు రైతులు తెలియజేశారు కోరారు.

## కోనేరుపల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం



**చొప్పదండి, మార్చి 24 (ప్రజా జ్యోతి):** చొప్పదండి మండలం కోనేరుపల్లి గ్రామ పంచాయతీ కి ఎంఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద మంజూరైన 10 లక్షల రూపాయల మురికి కాలువ, సి సి రోడ్డు పనులను మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని సూచించారు. గ్రామ సర్పంచ్ కాసు వేణుగోపాల రాజు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వేణుగోపాల రావు, ఉపసర్పంచ్ తిరుపతి, వార్డు సభ్యులు నరేందర్, వంశిక, మమత, ఫ్రాంచిస్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, సాంబయ్యపల్లి కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు పెరుక శ్రీనివాస్,గ్యాజంగి రాములు, మొగిలి, అశోక్, ఉమెందర్, ఆకేశ్, శంకర్, మల్లయ్య, శ్రీనివాస్, మణెమ్మ , శాంతమ్మ , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బిజెపి అధికారంలోకి రావడానికి ప్రతి కార్యకర్త పనిచేయాలి



**చొప్పదండి, మార్చి 24( ప్రజా జ్యోతి):** తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రావడానికి ప్రతి ఒక్క కార్యకర్త బూత్ స్థాయి నుండి పటిష్టంగా పనిచేయాలని జిల్లా బిజెపి అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి కోరారు. బిజెపి రాష్ట్ర, జిల్లా శాఖ ఆదేశాల మేరకు పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ 2026 కార్యక్రమం చొప్పదండి లోని ఎస్ ఆర్ ఆర్ ఫంక్షన్ హాల్ లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి చరిత్ర వికాసం గురించి వివరించారు. వక్తలుగా బత్తుల లక్ష్మీనారాయణ, కన్నెబోయిన ఓదెలు, సింగిరెడ్డి కృష్ణారెడ్డి, చేపూరి సత్యనారాయణ, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ , మధుకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు మొగిలి మహేష్, పట్టణ బిజెపి అధ్యక్షుడు చిల్ల శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్తాబాద్‌లో అదుపుతప్పిన వాహనం

**- డివైడర్‌ను ఢీకొని వ్యక్తికి గాయాలు**



**ముస్తాబాద్, మార్చి 24 ( ప్రజా జ్యోతి ):** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శివ బ్యాటరీ షాప్ సమీపంలో వాహనంపై ప్రయాణిస్తున్న ఆరుట్ల రాజిరెడ్డి అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, ఘటనాస్థలికి చేరుకున్న సిబ్బంది గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది..

**వేములవాడ,మార్చ్,24:ప్రజాజ్యోతి.** వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక పాఠశాల న్యూ అర్బన్ కాలనీ లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న విక్కుర్తి లక్ష్మీనారాయణ తెలంగాణ సాహితి కళా సేవా సమితి ఉగాది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన సందర్భంగా వారిని పాఠశాల లో ఘనంగా సన్మానించడం జరిగింది.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ అబ్దుల్ రజాక్. మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ సాబీర్ మాట్లాడుతూ " అవార్డులు వృత్తి బాధ్యతలను మరింత పెంచుతాయని, అందులో ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనది గౌరవప్రదమైనదని, ఎందుకంటే ఇది ఉత్తమ సమాజ నిర్మాణానికి, దేశ భవిష్యత్తును రూపుదిద్దడంలో కీలకపాత్ర పోషిస్తుందని, విద్యార్థులలో క్రమశిక్షణ జ్ఞానాన్ని పెంపొందిస్తూ వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులదేనని, సంస్కృతిని ఉన్నత మార్గంలో ఉంచడంలో ఉపాధ్యాయుల కృషి వెలకట్టలేనిదని, ఇంజనీర్లు, డాక్టర్లు, నాయకులు మరియు ఆవిష్కర్తల వంటి దేశ పౌరుల భవిష్యత్తును ఉపాధ్యాయులు రూపొందిస్తారని, విద్యార్థులకు అవసరమైన కమ్యూనికేషన్, క్రమశిక్షణ మరియు సమస్య పరిష్కార నైపుణ్యాలను బోధించి, వారిని జ్ఞానవంతులుగా మారుస్తారని, ఉపాధ్యాయులు కేవలం విద్యను అందించడమే కాకుండా విద్యార్థులు నైతిక విలువలను పెంచి వారిని ఉత్తమ పౌరులుగా మారుస్తారని, విద్యార్థుల జీవితంలో మార్పు తీసుకురావడంలో మరియు కష్ట సమయాల్లో సరైన మార్గదర్శకత్వం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా ముఖ్యమైనదని,' పాఠశాల లేని పల్లెటూరు అయినా ఉండవచ్చేమో గాని ఉపాధ్యాయుడు లేని ఊరు మాత్రం ఉండకూడదు' అనే మాట ఉపాధ్యాయుని ప్రాముఖ్యతను తెలియజేస్తుందని పేర్కొన్నారు.



ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ లు. సయ్యద్ షబ్బీర్. అక్కన్న పెల్లి పరుశురాం పాల్గొన్నారు.

## వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



**వేములవాడ,మార్చ్,24:ప్రజాజ్యోతి.** వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే. ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు, రికార్డులను సమగ్రంగా పరిశీలించారు.కేసుల దర్యాప్తులో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని, పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి, చట్టపరంగా నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలని ఆదేశించారు.ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా విలేజ్ పోలీస్ ఆఫీసర్ (వూా) వ్యవస్థను పకడ్బందీగా అమలు చేయాలని, వార్డులు, గ్రామాలను నిరంతరం సందర్శిస్తూ ప్రజలతో మమేకమై నేర నియంత్రణలో భాగస్వామ్యం కావాలని సూచించారు. ప్రజా ఫిర్యాదులపై ఆలస్యం చేయకుండా బాధితులకు తక్షణ స్పందన ఇవ్వాలని తెలిపారు.పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, డయల్ 100 కాల్స్‌కు వెంటనే స్పందిస్తూ సంఘటనా స్థలానికి త్వరితగతిన చేరుకోవాలని బ్లూ కోల్ట్, పెట్రోల్ వాహన సిబ్బందిని ఆదేశించారు. పెట్రోలింగ్ సమయంలో రౌడీ షీటర్లపై నిఘా ఉంచాలని పేర్కొన్నారు.

నేరాల నివారణలో భాగంగా సీసీటీవీ కెమెరాల ఏర్పాటు పెంచాలని,కీలక ప్రదేశాల్లో మరిన్ని కెమెరాలు అమర్చేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని, "ాతీతీఅజవ ాశ్రీఅజవ" కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, ట్రిపుల్ రైడింగ్, మైనర్ల డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు.

ఈ తనిఖీ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్,ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ పాల్గొన్నారు.

## పంటల సంరక్షణపై శాస్త్రవేత్తల దిశానిర్దేశం



**కొడిమ్యాల, మార్చి 24,(ప్రజాజ్యోతి)** :మండలంలోని కొడిమ్యాల, పూడూర్,తిర్మలాపూర్ రైతు వేదికల్లో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ తిర్మలాపూర్ రైతు వేదికలో పాల్గొనడం జరిగింది. అధిక యూరియా వినియోగం వల్ల కలిగే నష్టాలపై వీడియో ప్రదర్శించడం జరిగింది. మల్బరీ సాగు, వరి పంటలో చీడపీడల నియంత్రణ, మామిడి తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శాస్త్రవేత్తలు వివరించారు. అనంతరం రైతులు శాస్త్రవేత్తలతో పరస్పర చర్చ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి. జ్యోతి, సర్పంచ్ అంజయ్య, ఉపసర్పంచ్ ప్రశాంత్, ఏఈఓలు గ్రీష్మ, రాజేష్, తేజస్విని పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ఎన్సీసీ శిబిరం



**కరీంనగర్ బ్యూరో,మార్చి 24( ప్రజాజ్యోతి )** కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో గత రెండు రోజులుగా ఎన్సీసీ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాన్ని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి సందర్శించి శిక్షణ పొందుతున్న కెడెట్లతో ముఖాముఖి నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు దేశం పట్ల ఉన్న హక్కులు, విధులను అవగాహన కల్పించడం అవసరమన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు నైతిక విలువలను తెలుసుకొని వాటిని ఆచరణలో పెట్టాలని సూచించారు. విధేయత, ఏకాగ్రత, పరస్పర ప్రేమాభిమానాలు, సహాయస్ఫూర్తి వంటి గుణాలను అలవరుచుకోవాలని పిలుపునిచ్చారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఎన్సీసీకి ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, మార్గదర్శకాల ప్రకారం శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. శిబిరంలో సుమారు 150 మంది విద్యార్థులకు శిక్షణతో పాటు భోజన వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.శిబిరంలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, వసతులు కల్పించడంతో వారు సంతృప్తి వ్యక్తం చేయగా, ఎన్సీసీ అధికారులు కూడా నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళా పోలీసులకు షీ లీడ్స్ సదస్సు



**కరీంనగర్ క్రైం,మార్చి 24,ప్రజాజ్యోతి:**
మహిళా పోలీసుల సాధికారత కోసం కరీంనగర్ పోలీస్ ఆధ్వర్యంలో షీలీడ్స్ 2026 సదస్సును మంగళవారం కరీంనగర్ పోలీసు హెడ్క్వాటర్ లోని అస్త్ర కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీ గౌస్ ఆలం హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా పోలీసుల సేవా భావాన్ని కొనియాడారు.సదస్సులో మనోధైర్యం,ఆరోగ్యం, విధుల నిర్వహణపై అవగాహన కల్పించి ఉచిత వైద్య శిబిరం కూడా నిర్వహించామని పేర్కొన్నారు,ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ వెంకటరమణ,ఏసీపీలు,రిజర్వ్ ఇన్స్పెక్టర్లు,కరీంనగర్ కమిషనరేట్‌కు చెందిన మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

## ముస్తాబాదు పాఠశాలల్లో డీఈఓ తనిఖీలు

**- విద్యార్థుల అభ్యాసం, మధ్యాహ్న భోజనంపై సమగ్ర పరిశీలన**

**ముస్తాబాద్, మార్చి 24( ప్రజా జ్యోతి ):**
జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి ముస్తాబాదు మండల కేంద్రంలో ఉన్న మోడల్ స్కూల్ నామాపురం మరియు ముస్తాబాదు కేజీబీవీ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, ఆహారం నాణ్యతను పరిశీలించారు.అలాగే విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి అభ్యాస స్థాయి, సమస్యలు మరియు అవసరాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు మరింత మెరుగైన విద్య అందించేందుకు అవసరమైన సూచనలు చేశారు.అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, బోధన విధానాలపై చర్చించారు. విద్యా ప్రమాణాలు పెంపొందించడానికి కృషి చేయాలని, పాఠశాలల నిర్వహణలో మరింత శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నిమ్మరాజి రెడ్డి , ప్రిన్సిపాల్ కొండల్ రెడ్డి , ఉపాధ్యాయులు లలిత మేడమ్ మరియు ఆశా జ్యోతి మేడమ్ పాల్గొన్నారు.



## హజ్ యాత్రికులకు ఆరోగ్య పరీక్షలు, టీకాల పంపిణీ

**కరీంనగర్ బ్యూరో,,మార్చి 24( ప్రజాజ్యోతి )**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, పిఓ ఎంహెచ్ఎన్ డాక్టర్ సనా జవేరియా కలిసి కరీంనగర్‌లోని షాలిమార్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన హజ్ కమిటీ ట్రైనింగ్ మరియు వ్యాక్సినేషన్ క్యాంప్‌ను సందర్శించారు.
ఈ సందర్భంగా మొత్తం 139 మంది హజ్ యాత్రికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి టీకాలు అందించారు. 60 సంవత్సరాల పైబడిన వారికి సీజనల్ ఇన్ఫ్లుయెంజా, మెనింజైటిస్ టీకాలు ఇవ్వగా, 60 సంవత్సరాల లోపు వారికి ఒకటే టీకా అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సాజిద్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజగోపాల్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అలేఖ్య, హెల్త్ ఎడ్యుకేటర్ సరస్వతి, హజ్ కమిటీ సభ్యులు అజహార్, రియాజ్ అలీ, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.



## మండల స్థాయి రీడింగ్ ఛాంపియన్స్ పోటీలు

**ధర్మారం మార్చి24(ప్రజా జ్యోతి న్యూస్):**
విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందిచుట కొరకే రీడింగ్ చాపియన్స్ పోటీలు నిర్వహిస్తున్నామని మండల విద్యాధికారి పోతు ప్రభాకర్ అన్నారు.మంగళవారం రోజున మండల విద్యావనరుల కేంద్రంలో మండలస్థాయి రీడింగ్ చాంపియన్స్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ చదవడం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించడం
అనేది విద్యార్థులలోముఖ్యంగా ప్రాథమిక దశలో నైపుణ్యాలను,ఆసక్తిని పెంపొందించడానికి ఉద్దేశించిన కార్యక్రమమే రీడింగ్ ఛాంపియన్స్ పోటీలు అన్నారు.ఈ కార్యక్రమం ద్వారా పిల్లలు చిన్న వయస్సు నుంచే విద్యార్థులు చదవడం నేర్చుకుంటూ,చదువులో విజయం సాధించడానికి అవసరమైన ఆత్మవిశ్వాసాన్ని పొందుతారనీ ఇది పాఠశాలల్లో చదవడం ఒక సంస్కృతిగా మార్చడానికి, విద్యార్థుల అవగాహన సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి సహాయపడుతుందని అన్నారు.ముఖ్యంగా విద్యార్థులలో పఠనాసక్తిని పెంచడం,చదవడం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించడం, మెరుగైన అక్షరజ్ఞానం,విశ్లేషణాత్మక నైపుణ్యాలు మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించటమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు.రీడింగ్ ఛాంపియన్ అనేది విద్యార్థిల్లో చదవడంపై ఆసక్తిని పెంచే పాత్రనుపోషిస్తుందనీ,విద్యార్థులను ఎక్కువ సమయం చదివేలా ఈ పోటీలు ప్రేరేపిస్తాయనీ,చిన్న పిల్లలు వైఫల్యం నుండి విజయం వైపు వెళ్ళడానికి వారి మెదడుకు చురుకుదనాన్ని అందించే ఒక ఉత్తమ వేదికగా ఈ కార్యక్రమం నిలుస్తుందన్నారు.ధర్మారం మండల పరిధిలోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ఈ నెల రెండవ వారంలో ఉపాధ్యాయుల నేతృత్వంలో ఈ కార్యక్రమం పాఠశాల స్థాయిలో నిర్వహించారని ఇందులో విజేతలైన విద్యార్థులతో ఈ నెల ఇరవైవ తేదీన స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో నిర్వహించి ఒక్కొక్క కాంప్లెక్స్ నుండి జూనియర్,సీనియర్,తెలుగు, ఇంగ్లీష్ విభాగాల్లో కలిపి మొత్తం నలుగురిని విజేతలుగా ఎంపిక చేశారన్నారు.ఈ రోజు మండల స్థాయిలో రీడింగ్ చాంపియన్స్ పోటీలను కాంప్లెక్స్ స్థాయిలో విజేతలైన విద్యార్థులతో నిర్వహించామన్నారు. ఇందుకోసం తెలుగు,ఇంగ్లీష్ భాషోపాధ్యాయులు,రిసోర్స్ పర్సన్ల తో కూడిన ఎనిమిది మంది ఉపాధ్యాయులతో న్యాయ నిర్ణేతల బృందం ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు.ఈ రోజు రీడింగ్ చాంపియన్స్ గా జూనియర్ విభాగంలో పత్తిపాక ప్రాథమిక పాఠశాల విద్యార్థి ఎదుల్ల ఆధ్యంత్ ఇంగ్లీష్ లో,ప్రాథమిక పాఠశాల బొమ్మారెడ్డిపల్లి విద్యార్థిని పి.ఆరాధ్య తెలుగులో,సీనియర్ విభాగంలో రచ్చపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థి బి.అభయ్ సాత్విక్




తెలుగులో,ప్రాథమిక పాఠశాల నల్లలింగయ్యపల్లి విద్యార్థి సైపల్ అజ్మాన్ ఇంగ్లీష్ లో విజయం సాధించారని తెలిపారు.ఈ సందర్బంగా రీడింగ్ చాంపియన్స్ విజేతలైన చిన్నారులకు మండల విద్యాధికారితో బాటు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రీడింగ్ చాంపియన్స్ బ్యాడ్జ,ప్రశాంసా పత్రం,బహుమతులతో పాటు మెమోంటోలతో అభినదించారు.ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఖండేరావు పరీక్షిత్ నరేందర్ రావు,షీలా,శ్రీనివాసరావు వెంకటేశ్వర్లు,న్యాయ నిర్ణేతలు కందుకూరి భాస్కర్, మహేశ్వర్,జాడి శ్రీనివాస్, సతీష్,అరుణ,వ్యాల్ల రాజేందర్ రెడ్డి, హైమావతి, ఆఫ్జల్ వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ పార్కు వద్ద పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి భూమి పూజ చేసిన పుల్కం రాజు

**వేములవాడ,మార్చ్,24:ప్రజాజ్యోతి.**
ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేములవాడ అభివృద్ధి: 15 లక్షలతో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణం
రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సారథ్యంలో వేములవాడ పట్టణం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దబడుతోంది. పట్టణ ప్రజల అవసరాలను గుర్తించి, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ఎమ్మెల్యే పర్యవేక్షణలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. ఇందులో భాగంగా, వేములవాడ పట్టణంలోని మండల పరిషత్ ఆవరణలో ఉన్న మున్సిపల్ పార్కు వద్ద సందర్శకులు, ప్రజల సౌకర్యార్థం రూ. 15 లక్షల భారీ వ్యయంతో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మంగళవారం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అధికారులతో కలిసి ఈ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. పార్కుకు వచ్చే వేలాది మంది సందర్శకులు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో ఈ నిధులను మంజూరు చేయించారని పేర్కొన్నారు. నాణ్యతతో కూడిన నిర్మాణాన్ని గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలోని ప్రతి వార్డులో డ్రైనేజీలు, సిసి రోడ్లు, తాగునీటి సౌకర్యాలతో పాటు ఇలాంటి పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించడం ద్వారా పట్టణ పరిశుభ్రతకు, ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నట్లు ఆయన వివరించారు. ఎమ్మెల్యే ఆది



శ్రీనివాస్ కృషితో వేములవాడ పట్టణం రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, ఏఈ అనన్య, టీఓ అన్వేష్, స్థానిక కౌన్సిలర్లు, వివిధ విభాగాల మున్సిపల్

## మేడారంలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం

**ధర్మారం మార్చి24(ప్రజా జ్యోతి న్యూస్):**
మండలంలోని వివిధ గ్రామాలలో బొమ్మ రెడ్డిపల్లి, పత్తిపాక,ధర్మారం,దొంగతుర్తి గోపాలరావుపేట్,కటికనపల్లి, కమ్మర్ ఖాన్ పేట,ఖిలావనపర్తి, కొత్తూరు,మైదారం ఆమ్ సెంటర్లలో గ్రామంలో మంగళవారం రోజున పిహెచ్ సి ఆవరణలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సుస్మిత,డాక్టర్ అనుదీప్ ఆధ్వర్యంలో ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్, టిబి అలర్ట్ ఇంపాక్ట్ఇండియా పెద్దపెల్లి జిల్లా ప్రపంచ క్షయ దినోత్సవ ర్యాలీలో ఛాంపియన్స్ పాల్గొని ప్రజలకు టీబి చాంపియన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.టీబీ చాంపియన్,టీబీ లక్షణాల గురించి,టిబి ఎలా సోకుతుంది.టీబీ త్వరగా గుర్తించడం గురించి,టిబి వ్యాధి చికిత్స, డిబిటి,మరియు పోషకాహార కిట్ల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.గ్రామంలో టీబీ ఛాంపియన్ నిర్వహించే కార్యక్రమంలో టీబీ అవగాహన కల్పించారు.వ్యాధి సోకే అవకాశం కలిగిన ఏడు రకాల లక్షణాల గురించి వివరించి,ఆ లక్షణాలను గుర్తించి వారికి అవసరమైన తెమడ పరీక్షలు,ఎక్రేలు,ఇతరత్రా పరీక్షలు నిర్వహించడానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొని మన గ్రామాన్ని టీబీ రహిత గ్రామంగా తీర్చి దిద్దడానికై ప్రజలందరూ అవగాహనతో



ముందుండాలని కోరినారు.ఈ కార్యక్రమంలో అందరూ పి హెచ్ సి సిబ్బంది ప్రతి హెల్త్ సబ్ సెంటర్,ఆమ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

## అమరపెల్లి నారాయణ తీవ్ర ఆవేదన

## నాయి బ్రాహ్మణుల సమస్యలపై ప్రభుత్వ దృష్టి సారించాలి



**ధర్మారం,మార్చి24(ప్రజా జ్యోతి న్యూస్):** నాయి బ్రాహ్మణుల ఆర్థిక సమస్యలపై అమరపెల్లి నారాయణ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.తాను ఒక సాధారణ పౌరుడిగా,నాయి బ్రాహ్మణ వర్గానికి చెందిన వ్యక్తిగా తమ వృత్తికి ఎదురవుతున్న కష్టాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తున్నానని తెలిపారు.గత కొన్ని సంవత్సరాలుగా పెద్ద ఎత్తున కార్పొరేట్ సెలూన్లు పెరుగుతున్నాయని, వాటి ప్రభావంతో తరతరాలుగా ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న చిన్న నాయి బ్రాహ్మణుల పరిస్థితి దిగజారుతోందని ఆయన అన్నారు.చిన్న షాపులు నిర్వహించే వారికి కస్టమర్లు తగ్గిపోవడంతో ఆదాయం పడిపోయి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.ఆర్థిక ఒత్తిడుల కారణంగా కొంతమంది తీవ్ర నిరాశకు గురవుతూ అనారోగ్యకరమైన నిర్ణయాలు తీసుకునే పరిస్థితి ఏర్పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని నాయి బ్రాహ్మణులకు సహాయపడాలని కోరారు.ముఖ్యంగా:చిన్న నాయి బ్రాహ్మణులకు ఆర్థిక సహాయం అందించడంతక్కువ వడ్డీ రుణాలు మంజూరు చేయడంకార్పొరేట్ సెలూన్లపై నియంత్రణ చర్యలు తీసుకోవడంచిన్న వ్యాపారాలకు ప్రోత్సాహక పథకాలు అమలు చేయడంవంటి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమస్యను ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించి తగిన చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## బీఆర్ఎస్ కు మరో షాక్

## కాంగ్రెస్ లో చేరిన కొత్తపల్లి సర్పంచ్ శోభారాణి



**తిమ్మాపూర్ మార్చి 24 ( ప్రజాజ్యోతి )** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలో బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్ తగలింది. ఇటీవలనే బీఆర్ఎస్ కు చెందిన పర్లపల్లి గ్రామ సర్పంచ్ సూరం స్వప్న తన భర్త మహేందర్ రెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరితోపాటు పర్లపల్లి గ్రామానికి చెందిన మరో ముగ్గురు వార్డు సభ్యులు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే.

తాజాగా కొత్తపల్లి గ్రామ సర్పంచ్ గోదారి శోభారాణి కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం హైదరాబాద్ లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తన కార్యాలయంలో శోభారాణికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తుండటం, నిధుల మంజూరులో ఎలాంటి వివక్షత చూపించకపోవడం వంటి చర్యలు సత్ఫలితాలిస్తున్నాయని, బీఆర్ఎస్ సర్పంచులు కాంగ్రెస్ పార్టీలో చేరుతుండటం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.కొత్తపల్లి గ్రామ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తానన్నారు. మూడున్నర కోట్ల రూపాయల నిధులతో డ్రైనేజీ, మంచినీటి పథకం పనులను వచ్చే ఏప్రిల్ మాసంలో చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే వెల్లడించారు. పార్టీ కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యం పెంచాలని, అలాగే ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సర్పంచ్ శోభారాణిని ఎమ్మెల్యే కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కొత్తపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు గోదారి తిరుపతి, కవ్వంపల్లి యువ సేన జిల్లా అధ్యక్షుడు నోముల అనిల్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం జిల్లా నాయకుడు పోతుగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పిన్ లాండ్ టీచర్ ఎక్సేంజ్ ప్రోగ్రామ్ కు

## ఎంపికైన ఉడుత మహేష్ చంద్ర



**ఇల్లంతకుంటా మార్చ్ 24(ప్రజా జ్యోతి)** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రం లోని ఓజూస్త్రం పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ బయాలజీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఉడుత మహేశ్ చంద్ర ప్రతిష్టాత్మక పిన్ లాండ్ టీచర్ ఎక్సేంజ్ ప్రోగ్రామ్ కి ఎంపికయ్యాడు తెలంగాణ రాష్టం నుండి ఈ ప్రోగ్రాంకి 28 మంది ఉపాధ్యాయులు ఎంపికయినారు అందులో ఇల్లంతకుంట నుండి మహేష్ చంద్ర ఒకరు ఈ కార్యక్రమంలో ఐదు రోజులపాటు అనేక విద్యాసంస్థలను శిక్షణ పొందనున్నారు ఈ సందర్భంగా మహేష్ చంద్రను జిల్లా విద్యాశాఖ అధికారీ జగన్ మోహనరావు సెక్టోరియల్ అధికారి శైలజ పద్మజ గ్రామ సర్పంచ్ మామిడి రాజు ఉపాధ్యాయులు అభినందించారు

## ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ముగిసిన శిక్షణ

**గంభీరావుపేట మార్చి 24 (ప్రజా జ్యోతి):** ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాల గంభీరావుపేటలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఉన్నత చదువులు మరియు ఉద్యోగ కల్పన లక్ష్యంగా టాస్క్ మరియు కెరీర్ గైడెన్స్ ఆధ్వర్యంలో కన్వీనర్ డాక్టర్ జె శ్రవణ్ కుమార్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ పోటీ ప్రపంచం లో అన్నీ విషయాల పైన సమగ్ర అవగాహన ఉన్నప్పుడే ఉద్యోగాలు పొందడం ఈజీ అని తెలిపారు .. ప్రభుత్వ ఉద్యోగానికైనా ప్రైవేట్ ఉద్యోగానికైనా,పోటీ పరీక్షలను కైనా అప్టిట్యూడ్ రీజనింగ్ ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకున్నట్లయితే మరిన్ని జాబ్ మేళాలు నిర్వహించి క్యాంపస్ ఇంటర్వ్యూలకు సెలెక్ట్ అయ్యే విధంగా చూస్తామని తెలిపారు.. టాస్క్ ః కెరీర్ గైడ్ అండ్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ జై శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ ఇది చాలా అమూల్యమైన సమయమని, పోటీ పరీక్షల ప్రాముఖ్యతను కూడా వివరించారు.. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్ గా మ్యాజిక్ బస్సు నాంది ఫౌండేషన్ నుండి పి. సాగర్ బాబు విద్యార్థులకు అనేక అంశాల పైన వివరణ ఇచ్చారు. ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ముగిసిన శిక్షణ



ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాల గంభీరావుపేటలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఉన్నత చదువులు మరియు ఉద్యోగ కల్పన లక్ష్యంగా టాస్క్ మరియు కెరీర్ గైడెన్స్ ఆధ్వర్యంలో కన్వీనర్ డాక్టర్ జె శ్రవణ్ కుమార్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ పోటీ ప్రపంచం లో అన్నీ విషయాల పైన సమగ్ర అవగాహన ఉన్నప్పుడే ఉద్యోగాలు పొందడం ఈజీ అని తెలిపారు .. ప్రభుత్వ ఉద్యోగానికైనా ప్రైవేట్ ఉద్యోగానికైనా,పోటీ పరీక్షలను కైనా అప్టిట్యూడ్ రీజనింగ్ ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకున్నట్లయితే మరిన్ని జాబ్ మేళాలు నిర్వహించి క్యాంపస్ ఇంటర్వ్యూలకు సెలెక్ట్ అయ్యే విధంగా చూస్తామని తెలిపారు..

## బిఐఆర్డి మండలి సభ్యుడికి ఘనంగా సన్మానం



**గంభీరావుపేట, మార్చి 24(ప్రజా జ్యోతి)** బిఐఆర్ డి సభ్యులుగా ఎన్నికైన నాస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్రావును మంగళవారం ఘనంగా సన్మానించారు. మండల బిఆర్ఎస్ అధ్యక్షులు పాపగారి వెంకటస్వామి గౌడ్ అధ్యక్షతన గంభీరావుపేట మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. నాబార్డ్ అనుబంధ సంస్థ బ్యాంకింగ్ ఇనిస్ట్యూట్ రూరల్ డెవలప్మెంట్ లక్నో పాలక మండలి సభ్యుడిగా రవీంద్రరావును మరో రెండేళ్ల పాటు కొనసాగించడంపై బిఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికైనందుకు పలువురు శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్రావు మాట్లాడుతూ సహకార సంఘంలో గత 21 ఏళ్ల పాటు సభ్యులకు అందించిన సేవలకు ఫలితంగా డైరెక్టర్ పదవిని మూడవసారి పొడిగించారని తెలిపారు. కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ గా పదవీకాలంలో మెరుగైన సేవలు అందిస్తూ నష్టాల్లో ఉన్న వాటిని లాభాల బాటలో నడిపించినందున నాబార్డ్ సంస్థ తనకు తగిన గుర్తింపు అందించిందని అన్నారు. సహకరించిన రైతులకు సహకార సంఘ సభ్యులకు సభ్యులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ గౌరీనేని నారాయణరావు, పట్టణ అధ్యక్షులు వెంకట్ యాదవ్, నర్మాల మాజీ సర్పంచ్ ఎడబోయిన రాజు, నాయకులు గంధ్యాడపు రాజు, రాజేందర్, ఆంజనేయులు, వార్డు సభ్యులు చిలుక ప్రశాంత్, పిట్ల శ్రీమతి, దేవరాజ్, స్వామి, వహీద్ రాజేందర్ మల్లేశం అర్జున్ హైమద్ లతోపాటు పాల్గొన్నారు.

## విజయవంతంగా మహా

## అభియాన్ శిక్షణ

**చొప్పదండి, మార్చి 24 ( ప్రజా జ్యోతి):** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చొప్పదండి పట్టణ కేంద్రంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ శిక్షణ తరగతులు విజయవంతంగా పూర్తయ్యాయి.



ఈ శిక్షణ తరగతులలో పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ కమిటీ సభ్యులు భారీ ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి తాళ్ళపెల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి బలమని, ప్రతి కార్యకర్త ప్రజలతో కలసి పనిచేసి పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత నిర్మాణం, బూత్ స్థాయి బలోపేతం, సోషల్ మీడియా నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీ పాత్ర వంటి పలు ముఖ్య అంశాలపై వక్తలు కార్యకర్తలకు మార్గనిర్దేశనం చేశారు.ఈ శిక్షణ తరగతులలో పాల్గొని విజయవంతం చేసిన పార్టీ కార్యకర్తలకు వారు ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కరండ్ల మధుకర్, జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి క్రిష్ణా రెడ్డి, చొప్పదండి పట్టణ, మండల అధ్యక్షులు చిల్ల శ్రవణ్ కుమార్, మొగిలి మహేష్, నాయకులు జిట్ట కుమార్,సింగిరెడ్డి భూంరెడ్డి, గొల్ల గట్టయ్య, మంచికట్ల మల్లేశ్, మాచర్ల శశి కుమార్, జక్కుల శంకర్, తోట కోటేశ్, గన్ను నర్సింహా రెడ్డి, సంగ నరేశ్, విలాసాగరం అంజయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో

## గ్లోబల్ సైన్స్ అండ్ స్పేస్ ఎగ్జిబిషన్

**రామగిరి, మార్చి 24 (ప్రజాజ్యోతి) :** మండలంలోని కల్వచర్లలో గల కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో నేడు గ్లోబల్ సైన్స్ అండ్ స్పేస్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందని, విద్యార్థుల్లో శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను ఇస్రో, కేఎల్ ల్యాబ్స్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఇస్రో తరఫున స్టూడెంట్ ః పబ్లిక్ అవుట్‌రీచ్ విభాగానికి చెందిన డా. ఆర్.శ్రీనివాస్ పాల్గొననుండగా, ప్రత్యేక ఆకర్షణగా ఇస్రో ప్రతిష్టాత్మక "స్పేస్ ఆన్ వీల్స్ బస్"ను కూడా ప్రదర్శనకు తీసుకురానున్నారు. రామగిరి మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల నుంచి సుమారు వెయ్యి మంది విద్యార్థులు ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించేలా ఏర్పాట్లు చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బర్ల శ్రీనివాస్ తెలిపారు. అంతరిక్ష పరిశోధన, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పై విద్యార్థులకు అవగాహన కల్పించే విధంగా వివిధ మోడళ్లు, ప్రదర్శనలు, ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ గ్లోబల్ సైన్స్ అండ్ స్పేస్ ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.



## పాఠశాలలో. ఘనంగా విద్యార్థి నీ.జన్మదిన వేడుకలు



**కాల్వ శ్రీరాంపూర్ మార్చి 24 (ప్రజా జ్యోతి)**
కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని ఉషన్న పల్లె గ్రామంలో. గల ప్రభుత్వ ఆంగ్ల మధ్యమ ప్రాథమిక పాఠశాలలో. ఐదవ తరగతి చదువుకుంటున్న .పొన్నాల శ్రీనిధి. జన్మదిన వేడుకలను మంగళవారం రోజున ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు . ఈకార్యక్రమంలో మం దల .శ్రీ వాణి .ఎడ్ల స్రవంతి .సుప్రియ. ఉపాధ్యాయ బృందం. విద్యార్థిని. విద్యార్థులు. తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల కొనుగోలు కేంద్రం ఏర్పాటు పట్ల మార్కెట్ చైర్మన్ హర్షం



**చొప్పదండి, మార్చి 24 (ప్రజా జ్యోతి):** చొప్పదండి వ్యవసాయ మార్కెట్లో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం పట్ల మార్కెట్ చైర్మన్ కొత్తూరు మహేష్ హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఎలాంటి సమస్య అయినా సరే అడగగానే తీర్చే నాయకుడు మేడిపల్లి సత్యం అని అన్నారు. రైతుల కోరిక మీద మక్కల కొనుగోలు కేంద్రాన్ని వారం రోజుల్లో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి నెరవేర్చారని ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రైతుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారన్నారు. ఒక రైతు బిడ్డగా, రైతు కష్టం తెలిసిన వాడిగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే సత్యం కు మండల రైతుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతు ఎలాంటి అవస్థలు పడకూడదని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తనకు తెలియజేయాలని, నిత్యం రైతులకు వెన్నంటి ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు చైర్మన్ మహేష్ తెలిపారు.

## చిలుకవాగు ప్రక్షాళన నిధులకై వినతి



**కొడిమ్యాల, మార్చి 24,(ప్రజాజ్యోతి):**
మండలకేంద్రంలో ప్రధాన సమస్య అయిన చిలుకవాగు ప్రక్షాళనకై, మోడల్ బస్ స్టాండ్ నిర్మాణం కోసం నిధుల మంజూరీ నిమిత్తం మంగళవారం అసెంబ్లీలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క), రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలసి కొడిమ్యాల సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులు నిధుల కేటాయింపుపైన స్పష్టమైన హామీ ఇచ్చినట్టు తెలిపారు. గ్రామ అభివృద్ధికోసం ఇచ్చిన హామీల అమలుకు నిధుల మంజూరీకోసం కృషిచేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు సర్పంచ్ జీవన్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

## పీఎం శ్రీ పాఠశాలలో 'చెలిమి' కార్యక్రమం



**బీర్ పూర్, మార్చి 24 (ప్రజా జ్యోతి) :** బీర్ పూర్ పీఎం శ్రీ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసేందుకు 'చెలిమి' అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్రస్థాయి హరిత మిత్ర అవార్డు గ్రహీత, ప్రధానోపాధ్యాయులు జూపాక సుదర్శన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు తయారు చేసిన పర్యావరణ నమూనాలు, ప్రకృతి మోడల్స్, హస్తకళలు అందరినీ ఆకట్టుకున్నాయి.ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి సిరూప నాగభూషణం మాట్లాడుతూ.. చెలిమి కార్యక్రమం విద్యార్థుల్లో నైతిక విలువలు, సామాజిక స్పృహను పెంపొందిస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థులతో యోగాసనాలు వేయించి, సాంస్కృతిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ సముద్రాల శ్రీలత, ఉపాధ్యాయులు రమాదేవి, నాగరాణి, స్వరూప, రజియా, లలిత, మౌనిక మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు

**- నిబంధనలు తప్పనిసరి**

**- జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎం. జైపాల్ రెడ్డి**



**కోరుట్ల, మార్చి 24 ప్రజాజ్యోతి**
కోరుట్ల పట్టణంలో ప్రైవేట్ ఆస్పత్రులు మరియు స్కానింగ్ సెంటర్లపై జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎం. జైపాల్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఆస్పత్రుల నిర్వహణ, పరికరాలు, డాక్టర్ల అర్హతలు మరియు రిజిస్ట్రేషన్ వివరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రైవేట్ ఆస్పత్రులు మరియు క్లినిక్స్ ప్రభుత్వ నిబంధనల ప్రకారం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకుని, ప్రమాణాలకు అనుగుణంగా వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. నిబంధనలు పాటించని సంస్థలపై క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అదేవిధంగా, పి.సి.పి.ఎన్.డి.టి చట్టం ప్రకారం గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పూర్తిగా నిషేధించబడిందని, ఆడ శిశువుల హత్యను నివారించడమే ఈ చట్టం లక్ష్యమని తెలిపారు. లింగ నిర్ధారణ చేయడం లేదా వెల్లడించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. స్కానింగ్ సెంటర్లలో ఉన్న యంత్రాలు, డాక్టర్ల అర్హత ధ్రువీకరణ పత్రాలు రిజిస్ట్రేషన్ సమయంలో సమర్పించిన వివరాలకు అనుగుణంగా ఉన్నాయా అనే విషయాన్ని అధికారులు పరిశీలించారు.ఫారం-ఎఫ్‌లను ప్రతినెల 5వ తేదీ లోపు సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సమర్పించాల్సి ఉంటుందని, ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ వివరాలు ఒకే విధంగా ఉండాలని సూచించారు.లింగ నిర్ధారణ నిషేధంపై అవగాహన కల్పించేందుకు ఆస్పత్రులలో స్పష్టమైన ఫ్లెక్సీలు, బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఈ నిబంధనలను అతిక్రమిస్తే జరిమానాతో పాటు మూడు నెలల జైలు శిక్ష విధించబడుతుందని, సంబంధిత వైద్యుల రిజిస్ట్రేషన్ కూడా రద్దు చేయబడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి రాజేశం, సూపర్వైజర్లు నాగభూషణం, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## బీమా పథకాలు సామాన్యులకు కొండంత అండ : ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



**బీర్ పూర్, మార్చి 24, (ప్రజాజ్యోతి):**
కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు తుంగూర్ శాఖ ఖాతాదారుడు, దివంగత అప్పల మల్లేశం కుటుంబానికి పథకం కింద రూ. 2 లక్షల బీమా సొమ్ము అందింది. ఈ చెక్కును ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ చేతుల మీదుగా మృతుడి భార్య గంగవ్వకు అందజేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆపద సమయంలో ఇవి కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ హరిప్రసాద్, సర్పంచులు హరీష్, రాజగోపాల్ రావు, మాజీ కేడీసీసీ సభ్యులు రామచంద్ర రావు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## నాచుపల్లి జేఎన్టీయూహెచ్ ఇంజనీరింగ్ కళాశాలలో 'హ్యాక్ ఇన్నోవా 2కే26' హ్యాకథాన్

**కొడిమ్యాల, మార్చి 24,(ప్రజాజ్యోతి)**
మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూహెచ్ ఇంజనీరింగ్ కళాశాలలో 'హ్యాక్ ఇన్నోవా 2కే26' పేరుతో 24 గంటల హ్యాకథాన్ నిర్వహించినట్లు విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ సాహు ఛత్రపతి తెలిపారు.
కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొని తమ వినూత్న ఆలోచనలు, సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించారు. ఉత్తమ మూడు ప్రాజెక్టులను ఎంపిక చేసి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.మొదటి బహుమతిని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు గెలుచుకోగా, రెండవ స్థానాన్ని జేఎన్‌టీయూహెచ్ మంథని, మూడవ స్థానాన్ని జేఎన్‌టీయూహెచ్ జగిత్యాల విద్యార్థులు దక్కించుకున్నారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ సాహు ఛత్రపతి మాట్లాడుతూ, చిన్న ఆలోచనలే పెద్ద స్టార్టప్స్‌కు దారితీస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



## బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం మహనీయుల త్యాగం ఎనలేనిది



**ఎండపల్లి, మార్చి 24, (ప్రజా జ్యోతి)**
స్వతంత్ర భారతావనిలో బడుగు బలహీన వర్గాల హక్కులు సామాజిక అసమానతలు రూపు మాపడానికి కృషి చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రామ్ మహాత్మా జ్యోతిభా పూలే జయంతోత్సవాల ను పురస్కరించుకుని ఏప్రిల్ మాసంలో జరపనున్న ఉత్సవాలకు ఎండపల్లి మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించడానికి అన్ని దళిత సంఘాలు ఆధ్వర్యంలో మంగళ వారం రాజారాం పల్లి లోని ఎస్ ఆర్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన కమిటీ ను ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్ గా కొండాపూర్ గ్రామానికి చెందిన చెన్న కుమార స్వామి ని కమిటీ చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన మహనీయుల త్యాగాలు ఎనలేనివని ,వారి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించి రాబోయే తరాలకు స్ఫూర్తి నింపుతామని అన్నారు.జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ చెన్న కుమారస్వామి, గౌరవ అధ్యక్షులు, మంతెన లక్ష్మణ్, కోడి గంగయ్య, చుంచు మల్లేష్,ఉపాధ్యక్షులు రెడ్డిమల్ల తిరుపతి, చీమల కనకయ్య, దూడ భూమయ్య,ప్రధానకార్యదర్శి మంతెన సంజీవ్, దేవి రవీందర్, ముఖ్య సలహాదారులు గజ్జల రాజేశం, వర్కపురం రవి, నేతరి మల్లేశం, ఆరెల్లి మహేష్, చొప్పదండి ,లక్ష్మణ్,సలహాదారులు, బోయిని మధు, ఆ రెల్లి అనిల్,కోశాధికారి వడ్కపురం అశోక్, సంయుక్త కార్యదర్శిలు, బెంబడినరేష్, ఓరగంటి నాగేష్, దావుల అనిల్, సహాయ కార్యదర్శి లు, చిలుక అనిల్, మంతెన స్వామి, ఉప్పులేటి మారుతి, పాక రవీందర్, ప్రచార కార్యదర్శిలు, గౌరీ చిరంజీవి, జంగిలి హనుమాన్లు, దొనకొండ శంకర్, కనుకుట్ల రఘువర్ధన్, కార్యవర్గ సభ్యులు, మన్నె జితేందర్, గుమ్మడి లక్ష్మీనారాయణ, చిన్న సత్తయ్య, కుశనపల్లి రాయమల్లు, దూట శ్రీనివాస్, చొప్పదండి సతీష్,తదితరులు పాల్గొన్నారు

# మహిళా సాధికారతే లక్ష్యం: ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**- రూ. 20 లక్షలతో మహిళా సంఘ భవనం, రూ. 15 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన**



**జగిత్యాల రూరల్, మార్చి 24 (ప్రజాజ్యోతి):** మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం తాటిపెల్లి గ్రామంలో మహిళా సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆయన పేర్కొన్నారు. సోమవారం తాటిపెల్లి గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న మహిళా సంఘ భవనానికి, అలాగే రూ. 15 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళా సంఘాలు తమ సమావేశాలు నిర్వహించుకోవడానికి, వివిధ రకాల శిక్షణలు పొందడానికి ఈ నూతన భవనం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంత మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని, వారికి ప్రభుత్వం అన్ని వేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు.



ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమాదేవి, సర్పంచ్ బొలిశెట్టి గంగారెడ్డి, ఉపసర్పంచ్ మాధురి, పంచాయతీ కార్యదర్శి మౌనిక, ఏఈ రాజమల్లయ్య పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు నరేష్, నర్సారెడ్డి, సౌమ్య, దివ్య, లత, వెంకటేష్, మహిళా సంఘాల అధ్యక్షులు నర్సక్క, లక్ష్మి, పల్లె డాక్టర్ అనూష, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, మండల నాయకులు నక్కల రవీందర్ రెడ్డి, బాల ముకుందం, మాజీ సర్పంచ్ రత్నమాల-శంకర్, ఎంబరి మారుతి, నీరటీ గంగారెడ్డి మరియు పెద్ద సంఖ్యలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ తోటల పరిశీలన

# రైతులకు యాజమాన్య పద్ధతులపై సూచనలు

**బుగ్గారం, మార్చి 24(ప్రజాజ్యోతి ):** మండలంలోని గోపులాపూర్ గ్రామంలో ఆయిల్ పామ్ తోటలను జిల్లా ఉద్యాన అధికారి లత మంగళవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతు కొమ్మినేని తిరుపతి సాగు చేస్తున్న సుమారు 11 ఎకరాల ఆయిల్ పామ్ తోటను సందర్శించి, పంట స్థితిగతులను సమీక్షించారు.

తోటలో వివిధ దశల్లో ఉన్న గెలలను పరిశీలించిన ఆమె, ఒక్కో చెట్టుకు సగటున 10 నుంచి 12 గెలలు ఉన్నట్లు గుర్తించారు. గెలలు ఆరోగ్యంగా పెరుగుతున్నాయని, సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఎరువుల వినియోగం, నీటి నిర్వహణ, కలుపు నియంత్రణ వంటి అంశాలపై రైతులకు వివరించారు.

ఏప్రిల్--మే నెలల్లో గెలలు పక్వానికి వచ్చి కోతకు సిద్ధమవుతాయని, ముఖ్యంగా 2022-23 ఫిబ్రవరి--మార్చిలో నాటిన తోటలు ఎక్కువగా ఈ సీజన్‌లో కోతకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కోత దశకు చేరుకుంటున్న రైతులు ఆతురపడకుండా, ఉద్యాన శాఖ సూచనలు పాటిస్తూ పంటను సంరక్షించుకోవాలని సూచించారు.

గెలల కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సరైన కోత విధానం గురించి ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు.



ఈ కార్యక్రమంలో లోహియా కంపెని సీఈఓ, హెచ్ఈఓ వంశీకృష్ణ, అన్వేష్, గోపులాపూర్ సర్పంచ్ బీర్పూరి తిరుపతి,ఉప సర్పంచ్ సురేష్, లోహియా క్లస్టర్ మేనేజర్ రమేష్, ఫీల్డ్ ఆఫీసర్లు సంజీవ్, రాజకుమార్, రమణ తదితరులు పాల్గొన్నారు.

# జేఎన్టీయూ విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్

**కొడిమ్యాల, మార్చి 24,(ప్రజాజ్యోతి):** మండలంలోని నాచుపల్లి జేఎన్టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాలలో సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ విజయవంతంగా పూర్తయింది. ఈసీఈ, సిఎస్ఈ, ఐటీ విద్యార్థులు ఈ డ్రైవ్‌లో పాల్గొన్నారని,ఎంపిక ప్రక్రియను నాలుగు దశల్లో నిర్వహించినట్లు తెలిపారు. రాత పరీక్షలో 50 మంది అర్హత సాధించగా, తదుపరి టెక్నికల్, హెచ్ఆర్ రౌండ్లకు 49 మంది హాజరయ్యారని, తుది ఫలితాలను త్వరలో ప్రకటిస్తామని నిర్వాహకులు తెలిపారు.సీజీజీ ప్రతినిధులు సంస్థ విధివిధానాలు, శిక్షణా కార్యక్రమాలు, ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నరసింహ మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఇలాంటి డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ బి. సతీష్ కుమార్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్, కోఆర్డినేటర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# వద్దే లింగాపూర్ పీహెచ్‌సీలో టీబీపై అవగాహన కార్యక్రమం



**రాయికల్, మార్చి 24 (ప్రజా జ్యోతి)**
వద్దే లింగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ ముక్త్ అభియాన్‌లో భాగంగా మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కస్తూరిసతీష్ మాట్లాడుతూ, టీబీ వ్యాధిగ్రస్తులు కేవలం మందులు మాత్రమే కాకుండా పౌష్టికాహారం కూడా తీసుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. పేదరికం కారణంగా చాలామంది సరైన ఆహారం తీసుకోలేకపోవడం వల్ల వ్యాధి తీవ్రత పెరుగుతోందని పేర్కొన్నారు.టీబీ నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిస్తూ, కార్యక్రమంలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ శ్రీనివాస్ , హెల్త్ అసిస్టెంట్ భూమయ్య, ఫార్మసిస్టు దీపిక, ల్యాబ్ టెక్నీషియన్ రాజమణి,, స్టాఫ్ నర్స్ సుమలత, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాగు వంపు.. ఇసుక డంపు!

**- కథలాపూర్‌లో యథేచ్ఛగా అక్రమ నిల్వలు**

**- కరువైన అధికారులు పర్యవేక్షణ**

**- రేపటి వరద ముప్పుపై నిపుణుల హెచ్చరిక**

**కథలాపూర్, మార్చి 24(ప్రజాజ్యోతి):** కథలాపూర్ మండల పరిధిలోని వాగు పరివాహక గ్రామాలు అక్రమ ఇసుక దందాకు అడ్డాగా మారుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వాగుల నుండి ఇసుకను తవ్వి, సమీపంలోని వ్యవసాయ భూముల్లో భారీ డంప్‌లుగా మారుస్తున్నారు. తెల్లవారుజాము నుండే ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ, రైతుల ఖాళీ స్థలాల్లో నిల్వ చేస్తున్న తీరుపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల ఉదాసీనత:

ఇంత జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే అక్రమార్కులు రెచ్చిపోతున్నారని వాగు పరివాహక గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కొందరు అధికారుల అండదండలతోనే ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

పొంచి ఉన్న వరద ముప్పు:

వాగు ఒడ్డున అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు జరపడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. వచ్చే వర్షాకాలంలో సూరమ్మ చెరువు నిండి ప్రవహిస్తే, ఈ తవ్వకాల వల్ల వరద ఉధృతి పెరిగి పరివాహక ప్రాంతాలు మునిగిపోయే ప్రమాదం ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### ప్రజల డిమాండ్:

పర్యావరణానికి, భవిష్యత్తు తరాలకు ముప్పుగా మారిన ఈ అక్రమ ఇసుక డంప్‌లపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, అక్రమ నిల్వలను సీజ్ చేయడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

